క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రాయపురవాడ, రాగన్న దర్వాజ, వేయి స్తంభాల దేవాలయం, అలంకార్ కూడలి, కుమ్మరిగూడెం, అయోధ్యపూర్, రాంపేట, తరాలపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. న్యూశాయంపేట విద్యుత్ సబ్‌స్టేషన్, యాదవ నగర్, వడ్డెపల్లి, బాలసముద్రం, రాంపూర్, కడిపికొండ సబ్‌స్టేషన్‌ల ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ ప్రాంతంలో 10 నుంచి 12 గంటల వరకు టేకులగూడెం సబ్‌స్టేషన్ ప్రాంతంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వరంగల్‌లో గొర్రెకుంట విద్యుత్ సబ్ స్టేషన్, ఏనుమాముల, పోతన, దేశాయిపేట, కరీమాబాద్ సబ్ స్టేషన్ ప్రాంతం, శివనగర్, బొర్ర అయ్యాగారి వీధి, మెట్లబావి, విశ్వనాథ కాలనీ, రాములవారి వీధి, పల్లవి హాస్పిటల్ లేన్, స్టేషన్‌రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ ఒక ప్రకటనలో వివరించారు.

హసన్‌పర్తి : మండల పరిధిలోని చింతగట్టు, ఎల్లాపురం, జయగిరి, నాగారం, మల్లారెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి ఉదయం 11 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ సామ్యానాయక్ తెలిపారు.

కోటేశ్వర్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్ : కర్నూల్‌లోని రాయలసీమ యూనివర్సిటీ హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన మద్దిపెల్లి కోటేశ్వర్‌కు డాక్టరేట్ ప్రకటించింది. రాయలసీమ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరిశోధకుడిగా ఇన్విస్టిగేషన్ ఆఫ్ సైబర్ క్రైమ్ ఫోరెన్సిక్ ప్రిన్సిపుల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ రీసెర్చ్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.విశ్వనాథరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ బిపిన్ బిహారిజయసింగ్ పర్యవేక్షణలో కోటేశ్వర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

జనాభా పెరుగుదల ద్రవ్యోల్బణానికి దారి

ఖిలా వరంగల్ : జనాభా పెరుగుదలతో వనరుల కొరత ఏర్పడి వస్తువుల ధరల పెరుగుదల ద్రవ్యోల్బణానికి దారి తీస్తుందని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రేమలత తెలిపారు. శుక్రవారం కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

రామన్నపేట : నైపుణ్యత గల యువత అందుబాటులో ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఏవీవీ కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'జనాభా పెరుగుదల మనకు వరమో శాపమా' అను అంశంపై నిర్వహించిన చర్చా గోష్టిలో ప్రిన్సిపాల్ మాట్లాడారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

హన్మకొండ చౌరస్తా : రెండేళ్ల క్రితమే ఇవ్వాల్సిన పీఆర్‌సీ ఇప్పటి వరకు ఊసేలేదని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో శుక్రవారం ట్రెంగా ముఖ్య సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గుట్కా పట్టివేత



రామన్నపేట : నగరంలోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిన్నవారివీధిలో రాజ్‌పురోహిత్, భవాని సింగ్ ప్రభుత్వ నిషేధిత గుట్కాను అక్రమంగా నిల్వ ఉంచిన సమాచారంపై తనిఖీలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.4.30 లక్షల విలువ చేసే తంబాకు పాట్లాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుడితో పాటు పట్టుకొని సొత్తును తదుపరి విచారణకు మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. మరో నిందితుడు వ్యాపారి రాజ్‌పురోహిత్ జబ్బర్ సింగ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ జి.బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మురుగు

- అనారోగ్యం బారిన పడుతున్న స్థానికులు
- కడిపికొండలో కానరాని డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ పరిధి కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని ఆర్వోబీకి కూతవేటు దూరంలో ఉన్న ఇళ్ల చుట్టు మురుగు నీరు నిలుస్తోంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు లేకపోవడంతో జెడ్పీహెచ్ఎస్ వెనుక ఉన్న కాలనీలో మురుగునీరు నిలిచి కుంటలను తలపిస్తోంది. దాంతో ఇంటి నుంచి బయట అడుగుపెట్టాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

డ్రెయినేజీలు, రోడ్లు లేక..

సరైన డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు లేకపోవడంతో గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో మురుగు నీరుకు తోడు వరద నీటితో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు కుంటలను తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో పాకురు పేరుకుపోయి గ్రీన్‌మ్యాట్‌లా దర్శనమిస్తోంది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రీన్ మ్యాట్‌ను తలపిస్తున్న పాకురు



కుంటను తలపిస్తున్న మురుగునీరు

జ్వరాల బారిన పడుతున్నాం



మా ఇళ్ల మధ్య నిల్వ ఉంటున్న మురుగునీరుతో దుర్వాసన వస్తోంది. పందులు, కుక్కలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు, ఈగలతో జ్వరాల బారిన పడుతున్నాం. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలి.

– బస్కే ఎల్లమ్మ, కడిపికొండ

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



మా కాలనీలో నెలకొన్న మురుగునీరు సమస్యను పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. మురుగు నీరు నిల్వ తో దుర్వాసన వస్తోంది. దోమల కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బస్కే వెంకటస్వామి, స్థానికుడు

భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లా వేలేరు మండలం కన్నారం గ్రామంలోని 211 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి అర్హులైన దళితులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కన్నారంలో 197/1, 192, 207, 30/2, 74/1తో పాటు పలు సర్వే నెంబర్లలోని మొత్తం 211 ఎకరాల ప్రభుత్వ భూమి పై గ్రామానికి చెందిన కొందరు భూస్వాముల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడి తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడి అర్హులైన దళితులకు కేటాయించి పట్టాపాస్ పుస్తకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, రాములు, లక్ష్మి, సమ్మక్క, నవరత్న, రాజమ్మ, ప్రమీల, విజయరాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

హన్మకొండ : వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 13న జరిగే యుద్ధం ఎవరి కోసం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకులు ఎన్‌రెడ్డి హంస రెడ్డి, శివాజీ, రాజ్ మహమ్మద్, ఎం.సదానందం, శ్రీనివాసరావు, నాగార్జున, మాస్ సావిత్రి, మహేష్, శ్రావణ్, శివ, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

రేపు హరిత హోటల్‌లో సదస్సు

హన్మకొండ : అప్పుల ఊబిలో తెలంగాణ.. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అనే అంశంపై ఈనెల 13న మేధావులచే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ తెలిపారు. శుక్రవారం బాలసముద్రంలోని వెంకటనారాయణ స్వగృహంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం 10.30 గంటలకు నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం బెటర్ వరంగల్ అధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

76 ఇళ్లకు భూమి పూజ

కాజీపేట : గ్రేటర్‌లోని 63వ డివిజన్ ఒడ్డెర కాలనీలో శుక్రవారం నిల్వ నీడలేని నిరుపేదల ఇందిరమ్మ ఇళ్లకు కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 76 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా పార్టీ కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అరూరి సాంబయ్య, పోగుల సంతోష్, ఎన్.కుమారస్వామి, క్రాంతిభరద్వాజ్, షబ్బీర్, బిలాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. 35వ డివిజన్‌లో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్ హాజరై కాంగ్రెస్ నేతలు రేణుకుంట్ల శివకుమార్, పాల్గొన్నారు.

రేపు ప్రెస్‌క్లబ్ సభ్యులకు హెల్త్ క్యాంప్

నయీంనగర్ : ప్రెస్‌క్లబ్ సభ్యుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నామని ప్రెస్‌క్లబ్ కమిటీ శుక్రవారం తెలిపింది. శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఉచిత రక్తపరీక్షల నమూన సేకరణ జరుగుతుంది. ఈ పరీక్షల ఆధారంగా ఆదివారం హెల్త్ క్యాంప్‌లో నిపుణులైన వైద్యులు వ్యాధి నిర్ధారణ, తగిన వైద్యం అందిస్తారని కమిటీ తెలిపింది. ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, కార్యవర్గసభ్యులు కోరారు.

ఏసీ ప్రెస్‌మీట్ హాల్ ప్రారంభం

గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ మొదటి అంతస్తులో ఆధునీకరించిన ప్రెస్ మీట్ హాల్‌ను శుక్రవారం అధ్యక్షుడు నాగరాజు ప్రారంభించారు.



ఏసీ ప్రెస్‌మీట్ హాల్‌ను ప్రారంభిస్తున్న నాగరాజు

ఖర్చుల నుంచి రైతులను తప్పించాలి

వరంగల్ చౌరస్తా : వ్యవసాయ మార్కెట్‌లో రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన ఉత్పత్తులను పైసా ఖర్చు లేకుండా వ్యాపారులు భరించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు తెలంగాణ రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, నాయకులు సిరుల శ్రీనివాస్, నరేందర్ తదిరులు కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనామ్, దడువాయి, హామాలీ దిగుమతి, చాట, కమీషన్ పేరుతో మోసం చేస్తున్నారన్నారు. అంతేకాకుండా కాశిబుగ్గ నుంచి మొగిలిచర్ల ప్రధాన రహదారి ఉన్న మార్కెట్‌కు సంబంధించిన 37 గంటల ఖాళీ స్థలంలో రైతు విశ్రాంతి భవనం, శిక్షణ కేంద్రాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.



మంత్రి తుమ్మలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నవాబ్ అలీ నవాజ్ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్‌ను విద్యుత్ ఇంజనీర్లు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ 148వ జయంతిని శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, డైరెక్టర్ సి.ప్రభాకర్, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం సబ్‌స్టేషన్ కట్టడాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చే హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ చెరువుల రూపకల్పన నవాబ్ అలీ ప్రతిభకు నిదర్శనమని అభివర్ణించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహన్, రవీంద్రనాథ్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, జీఎంలు వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నవాబ్ అలీ నవాజ్ జంగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వరుణ్ రెడ్డి

గౌతమబుద్ధుని బోధనలు ఆచరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా, ఆయా సంఘాల నాయకులు

- బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.సుదర్శన్

హన్మకొండ : ఆర్థిక అంతరాలు, సామాజిక వివక్షలు, అమానవీయ సంఘటనలు, అనైతిక ప్రవర్తనలతో కునారిల్లుతున్న వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుని బోధనల అవసరం ఎంతో ఉందని, వాటిని ఆచరించాలని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.సుదర్శన్ అన్నారు. శుక్రవారం హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని బుద్ధ ప్లాజావద్ద ఈ నెల 13న ప్రదర్శించనున్న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు రూపొందించిన బుద్ధునితో నా ప్రయాణం నృత్యరూపక నాటకం పోస్టర్‌ను బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు, అంబేడ్కర్ వాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ రిటైర్డ్ డీఐజీ ఆంజనేయరెడ్డి, కె.కె.రాజ, బీఎస్ఎస్ మూర్తి, సిద్దోజిరావు, మల్లెపల్లి లక్ష్మయ్య పర్యవేక్షణలో రూపొందించిన ఈ నాటకాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 31 వరకు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో 25 మంది కళాకారులచే నృత్యరూపక నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేడ్కర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరమళ్ల కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి పుండుర్తి సాంబయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ జంగిలి వెంకటస్వామి, కోశాధికారి కిషన్, నర్సయ్య, రమేష్, రవిప్రసాద్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైల్వే టెక్నీషియన్ హఠాన్మరణం

కాజీపేట రూరల్ : కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన రైల్వే టెక్నీషియన్ పోతుల రజినీకాంత్ (43) శుక్రవారం హఠాన్మరణం చెందాడు. డీజిల్ బ్రాంచీ రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ ఎస్.కె.జానివియా, ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డీజిల్‌షెడ్‌లో టెక్నీషియన్–1 గా పని చేస్తున్న రజినీకాంత్ శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్ద గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న రైల్వేమజ్దూర్ యూనియన్ నాయకులు

కడుపునొప్పి భరించలేక ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మడికొండ: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడిపికొండ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన రేణుకుంట్ల రమేశ్(43) మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కడుపునొప్పి వస్తుందని చెప్పి హాల్లో పడుకుంటానని ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య రేణుకుంట్ల అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

అప్పుల బాధ భరించలేక మరొకరు..

హసన్‌పర్తి : అప్పుల బాధ భరించలేక ఓ దినసరి కూలీ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్ధాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. సిద్ధాపురానికి చెందిన చిల్లా నర్సయ్య(40) కుటుంబ పోషణ నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పులు తీసుకొచ్చాడు. అప్పులు పెరిగిపోవడంతో ఇక తీర్చలేని బాధతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై రవి సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.



నర్సయ్య (ఫైల్)

బాధితుడికి క్షమాదేశ్‌పాండే పరామర్శ

కాజీపేట రూరల్ : దర్గా కాజీపేటకు చెందిన తీగల సాంబమూర్తి కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఆక్సిజన్‌పై ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు. దీనికి కరెంట్ ఉపయోగిస్తున్నారు. దీంతో కరెంట్ బిల్లు వేలాదిగా వస్తుంటే బాధిత కుటుంబం వారు కట్టలేని పరిస్థితి ఉంది. ఈ మేరకు బాధితుడి విషయం తెలుసుకున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే శుక్రవారం నేరుగా బాధితుని ఇంటికి వెళ్లారు. సంబంధిత ఎలక్ట్రిసిటీ శాఖ వారితో మాట్లాడి పవర్ కట్ చేయకుండా కొంత సమయం ఇవ్వాలని కోరారు. అదే విధంగా జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు బాధితుడి ఇంటికి వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బాధితుడి ఇంటికి వెళ్లిన వారిలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, లైన్‌మెన్, వైద్యాధికారులు సృజన, తదితరులు ఉన్నారు.



బాధితుడి భార్యతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే

ఇంటిగ్రేటెడ్ స్కూల్ వేరే చోట నిర్మించాలి

కేయూ క్యాంపస్ : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీ భూమిలో కాకుండా వేరే చోట నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్‌లోని వీసీ చాంబర్ వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఎంతకైనా తెగిస్తామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హన్మకొండ చౌరస్తా : మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలుకు ఆమోదం తెలుపడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో సీఎం రేవంతర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాసంపత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

హన్మకొండ కల్చరల్ : వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శుక్రవారం ఉప్పరోనికుంట మంకీఫుడ్‌కోర్ట్ ప్రాంతాల్లోని గుంతల్లో నీరు నిల్వ ఉన్న చోట్ల అయిల్‌బాల్స్ వేశారు.

ఆర్యవైశ్యులు సంఘంలో భారీగా చేరాలి

వరంగల్ చౌరస్తా : వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పట్టణ సంఘంలో చేరాలని, ఎన్నికల్లో కీయశీలక పాత్ర పోషించాలని సంఘం రాష్ట్ర నాయకుడు గట్టు మహేశ్‌బాబు కోరారు. నూతన కార్యవర్గం కోసం త్వరలో ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి

కాజీపేట : తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌ను శుక్రవారం హనుమకొండ జిల్లాకు చెందిన కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

సామాజిక సేవ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

విద్యారణ్యపురి : భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఇవి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని బీవీపీ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని భారత్ వికాస్ పరిషత్ జిల్లా కార్యాలయంలో బీవీపీ స్థాపన దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్డినెన్స్‌తో బీసీ రిజర్వేషన్లు సాధ్యం కాదు

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చే ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. శుక్రవారం సుబేదారిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్డినెన్స్ ప్రకారం రిజర్వేషన్ల పరిమితి 50 శాతం కంటే ఎక్కువగా ఉంటే గవర్నర్ ఆమోదిస్తారా అలాగే గతంలో లాగా అనేక న్యాయపరమైన చిక్కులు, సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

బాలికను అప్పగించిన జీఆర్పీ పోలీసులు

కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్పీ పోలీసులు శుక్రవారం తప్పిపోయిన బాలికను తల్లికి అప్పగించారు. జీఆర్పీ సీఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం.. కాజీపేట రైల్వేస్టేషన్‌లో గత బుధవారం చిదురాల అంజలి ఒంటరిగా ప్లాట్‌ఫాంపై కనిపించగా షెల్టర్ కోసం హన్మకొండ సఖి వన్‌స్టాప్ సెంటర్ వారికి అప్పగించారు. తల్లి స్వరూపను సఖీ సెంటర్‌కు పిలపించి బాలిక అంజలిని అప్పగించారు.

కార్యకర్తలే పార్టీకి పునాది

హసన్‌పర్తి: కార్యకర్తలే పార్టీకి పునాదు అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సీతంపేట గ్రామ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.

స్థాయిని మరచి విమర్శలు చేయడం మానుకోవాలి

కాజీపేట : మైనార్టీ కులాన్ని అడ్డం పెట్టుకుని ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి పదవులను అనుభవిస్తున్న అజీజ్‌ఖాన్ తన స్థాయిని మరచి నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా మాజీ కార్యదర్శి ఎస్‌కె.మహమూద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ మైనార్టీ సెల్ కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేయూ భూములకు ప్రహరీ నిర్మించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ భూముల చుట్టు ప్రహరీని నిర్మించాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మద్రి మహేష్, స్వేరో జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, బీ ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు కమ్మర్‌పెల్లి శివ మాట్లాడారు. యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీ భూముల్లో నిర్మించాలనే ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో ధర్మ స్టూడెంట్స్ యూనియన్ కన్వీనర్ ధర్మ, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్‌కన్వీనర్ మాస్ సావిత్రి, డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివపాల్గొన్నారు.

డీఈఓ ఆఫీస్ ఎదుట ధర్నా

విద్యారణ్యపురి : వరంగల్ జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో, మోడల్ స్కూల్స్‌లో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఏబీఎస్ఎఫ్, బీ ఎస్ఎఫ్, స్వేరోస్ యూ నియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వాటిల్లో టీచింగ్, టీచింగ్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్ల పంపిణీ

ఖిలా వరంగల్ : శంభునిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాణిరుద్రమ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు.